వడగండ్ల వర్షం.. రైతన్నకు నష్టం

- నేలకొరిగిన ఉద్యానపంటలు
- నిమ్మనపల్లె మండలంలో 142 ఎకరాల్లో పంట నష్టం
- క్షేత్రస్థాయిలో ఉద్యానశాఖ అధికారి పరిశీలన
- ఆదుకోవాలంటున్న రైతులు




రాచవేటివారిపల్లెలో విరిగిన అల్లనేరేడు చెట్టును చూపుతున్న రైతు రమణారెడ్డి, టమాటా పంటను పరిశీలిస్తున్న హార్టికల్చర్ అధికారి ఈశ్వర్‌ప్రసాద్‌రెడ్డి

నిమ్మనపల్లె : రెండురోజులుగా తీవ్రగాలులతో కూడిన వడగండ్ల వర్షం ప్రభావంతో మండలంలోని ఉద్యానపంటలు నేలవాలాయి. రైతులు పెద్దమొత్తంలో పంటలను నష్టపోయారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలంటూ అన్నదాతలు వేడుకుంటున్నారు. మండల పరిధిలో దాదాపు 142 ఎకరాల్లో ఉద్యాన పంటలు వడగండ్ల వర్షం కారణంగా పూర్తిగా దెబ్బతిన్నాయి. గురువారం మదనపల్లె ఉద్యానశాఖాధికారి ఈశ్వర్‌ప్రసాద్‌రెడ్డి క్షేత్రస్థాయిలో పర్యటించి పంటనష్టం అంచనా వేశారు. రాచవేటివారిపల్లె గ్రామంలోని అక్కులరమణారెడ్డి పొలంలో విరిగిపోయిన అల్లనేరేడు చెట్లను పరిశీలించారు. 12 ఏళ్ల వయస్సు కలిగిన 14 అల్లనేరేడుచెట్లు విరిగిపోవడంతో రూ.లక్షకు పైగా నష్టం వాటిల్లిందని, మామిడి పంటలో పూత, పిందె రాలిపోవడంతో దాదాపు రూ.2లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని రైతు రమణారెడ్డి అధికారి ఈశ్వర్‌ప్రసాద్‌రెడ్డికి వివరించారు. అనంతరం ఆయన టమాటా, బీర, వంగ తదితర పంట పొలాలను పంచాయతీ పరిధిలో వ్యవసాయ సహాయకులతో కలిసి క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించారు. తీవ్రగాలులు, వడగండ్లు సృష్టించిన బీభత్సానికి మండలంలోని రాచవేటివారిపల్లె, వెంగంవారిపల్లె, రెడ్డివారిపల్లె, నిమ్మనపల్లె గ్రామాలలో ఉద్యానవన పంటలను సాగుచేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. పడమటి మండలాలలో ప్రధాన పంటలైన టమాటా, మామిడి, బొప్పాయ, అల్లనేరేడు వంటి ఉద్యానపంటలు ప్రస్తుతం పూత, పిందె దశలో ఉండగా గురు, శుక్రవారాల్లో కురిసిన అకాలవర్షంతో చెట్లు విరిగి నేలమట్టం అయ్యాయి. అప్పులు చేసి పంటలు సాగుచేసిన రైతులు తీవ్రంగా నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

ఉద్యాన పంటలకు నష్టం

మండల పరిధిలో వందల ఎకరాల్లో ఉద్యాన పంటలు తీవ్రగాలులు, వడగండ్లతో కూడిన అకాల వర్ష ప్రభావానికి దెబ్బతిన్నాయి. చెట్లు విరిగి, పిందెలు రాలి, టమాటా మొక్కలు గాలికి కొట్టుకుపోవటంతో రైతులకు తీవ్రనష్టం వాటిల్లింది. ఇందులో టమాటా 102, బొప్పాయి..10, మామిడి..17, అల్లనేరేడు..1, బెండ..3, బీర..2, దోస,కర్బూజా..6, కాకర-1 ఎకరాల్లో నష్టం వాటిల్లింది.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి...



అకాలవర్షం కారణంగా నష్టపోయిన ఉద్యాన పంటల రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి. అప్పులు చేసి పంటలను సాగుచేసిన పంటలు అకాల వర్షం కారణంగా దిగుబడి దశలోనే నేలమట్టం కావడంతో తాము తీవ్రంగా నష్టపోయాం. పంట నష్టాన్ని గుర్తించి తమను ఆదుకోవాలి.

– అక్కుల రమణారెడ్డి, రాచవేటివారిపల్లె

ప్రభుత్వ దృష్టికి తీసుకెళతాం



మండలంలో గత రెండురోజులుగా గాలి, వాన, వడగండ్ల బీభత్సంతో మామి డి, టమాటా, బొప్పాయ, అల్లనేరేడు, బీర, బెండ వంటి పంటలకు 142 ఎకరాల్లో తీవ్ర నష్టం వాటిల్లిందని ప్రాథమికంగా అంచనా వేశాం. పంటనష్టం వివరాలను ప్రభుత్వానికి అందజేసి పరిహారం అందేలా కృషిచేస్తాం.

– ఈశ్వరప్రసాద్‌రెడ్డి, ఉద్యానశాఖ అధికారి

క్లుప్తంగా

నేడు అంకాళమ్మకు బోనాలు

కలికిరి: కలికిరి–పీలేరు మార్గం శివపురం వద్ద వెలసిన శ్రీఅంకాళమ్మ గంగల మహోత్సవంలో భాగంగా ఆదివారం ఉదయం అమ్మవారికి బోనాల సమర్పణ కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. శనివారం రాత్రి జాగారం, ఆదివారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం శివపురంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు ఊరేగింపుగా మేళతాళాల మధ్య విచ్చేసి అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటారు.

అనుకున్న లక్ష్యాలను పూర్తి చేయాలి

తంబళ్లపల్లె: జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేసి అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని డీఎల్‌డీఓ లక్ష్మీపతి కోరారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో డిజిటల్, ఇంజినీరింగ్, వెల్ఫేర్ అసిస్టెంట్లు, పంచాయితీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం జరిగింది. గ్రామాలవారి జరుగుతున్న పనులు, సమస్యలు తదితర అంశాలపై ఆరా తీశారు. సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు గుర్తించిన వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. అన్ని రకాల సేవలను సచివాలయాల ద్వారానే ప్రజలకు సకాలంలో అందజేయాలన్నారు. సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో ఆనంద్‌కుమార్, హౌసింగ్ డీఈ శ్రీహరి పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట

గుర్రంకొండ: మండలంలోని నడిమికండ్రిగ పంచాయతీ మొటుకు క్రాస్ వద్ద ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. స్థానిక మొటుకు క్రాస్‌దగ్గర ఎరుకలవాని ఇండ్లు కాలనీకి సమీపంలో ఇటీవల నూతనంగా ఆంజనేయస్వామి ఆలయాన్ని నిర్మించారు. శనివారం స్వామి విగ్రహప్రతిష్ట సందర్భంగా ఉదయం నుంచి యజ్ఞహోమాలు పెద్ద ఎత్తున నిర్వహించారు. గణపతి, నవగ్రహ హోమాలు చేశారు. ఆలయంలో స్వామివారి విగ్రహంతో పాటు ఎన్‌హెచ్ 340 జాతీయ రహదారి పక్కన ఎనిమిది అడుగుల మేరకు నూతన విగ్రహాన్ని ప్రతిష్టించారు. పెద్ద ఎత్తున గ్రామస్తులు తరలి వచ్చి స్వామివారికి పూజలు నిర్వహించారు.

ఓటరుకు ఆధార్ అనుసంధానం చేయాలి

కలికిరి: ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం త్వరితగతిన పూర్తి చేయాలని పీలేరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె.గోపాలక్రిష్ణ అన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో శనివారం ఆయన మండల పరిధిలోని బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలికిరిలో పరిధిలోని బీఎల్‌ఓలు ఆధార్ అనుసంధానంపై చురుగ్గా పనిచేయడంలేదన్నారు. లక్ష్యం మేరకు మరో వారం రోజుల్లో వంద శాతం పూర్తి చేయాలన్నారు. నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో తహసీల్దారు భాగ్యలత, ఆర్ఐ చాణక్య, సీనియర్ అసిస్టెంట్ హుస్సేన్, వీఆర్ఓలు పాల్గొన్నారు.

వందశాతం టీకాల లక్ష్యాన్ని సాధించాలి

వాల్మీకిపురం: వందశాతం టీకాల లక్ష్యాన్ని సాధించాలని జిల్లా డీపీఎంఓ డాక్టర్ లోకవర్ధన్ అన్నారు. మండలంలోని చింతపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జమ్మన్నపల్లి గ్రామంలో టీకాల కార్యక్రమాన్ని డాక్టర్ లోకవర్ధన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి గర్భిణికి, పుట్టిన ప్రతి శిశువుకు క్రమం తప్పకుండా టీకాలు ఇవ్వాలన్నారు.

చిరుధాన్యాల ప్రాముఖ్యతను గుర్తించాలి

- కేవీకే కో–ఆర్డినేటర్ డాక్టర్ పాండురంగ

కలికిరి: చిరుధాన్యాల ప్రాముఖ్యతను గుర్తించి ప్రతి ఒక్కరూ ఆహారపు అలవాట్లలో చిరుధాన్యాల ఉత్పత్తులు ఉండేలా చూసుకోవాలని కేవీకే కో–ఆర్డినేటర్ డాక్టర్ పాండురంగ అన్నారు. అంతర్జాతీయ చిరుధాన్యాల సమావేశంలో పీఎం మోదీ ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా రైతులకు తెలియజేశారు. చిరుధాన్యాల పంటలను తక్కువ సాగునీరు, తక్కువ ఎరువులు వినియోగంతో సాగు చేయవచ్చన్నారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా మార్కెట్‌లో డిమాండ్ పెరిగిందన్నారు. రైతులు చిరుధాన్యాల సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలని, తక్కువ పెట్టుబడితో ఆదాయం పొందవచ్చని తెలిపారు. గృహ వి/జ్ఞాన శాస్త్రవేత్త జ్యోతి చిరుధాన్యాల ఉత్పత్తుల ఉపయోగాలను వివరించారు.

రాజకీయ అజ్ఞానంతో లోకేష్ ఆరోపణలు

- ధైర్యం ఉంటే అభివృద్ధిపై మాట్లాడు
- శివలింగం ఆరోపణలపై ప్రమాణానికి సిద్ధమా
- లోకేష్ అనుచిత వ్యాఖ్యలపై వైఎస్సార్‌సీపీ శ్రేణులు ధ్వజం



మాట్లాడుతున్న ఎంపీపీ సాయిలీలా

ములకలచెరువు: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ప్రారంభమై ములకలచెరువులో ముగిసిన యువగళం పాదయాత్ర బహిరంగ సభలో నారా లోకేష్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై శనివారం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ధ్వజమెత్తారు. ములకలచెరువులో జరిగిన విలేకర్ల సమావేశంలో వైఎస్సార్‌సీపీ ఎంపీపీలు, జెడ్పీటీసీలు సాయిలీలా, అనసూయమ్మ, మహమ్మద్ దస్తగిరి, మోహన్‌రెడ్డి, రామచంద్ర, శివన్న, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ సురేంద్రనాథ్‌లు మాట్లాడారు. తంబళ్లపల్లె మల్లయ్యకొండలో వెలసిన శ్రీమల్లికార్జున స్వామి ఆలయంలో శివలింగాన్ని మాయం చేశారని లోకేష్ మతిభ్రమించి ఆరోపణలు చేయడం సిగ్గు చేటు అన్నారు. శివలింగం ఆరోపణలపై ప్రమాణానికి సిద్ధమా అని సవాలు విసిరారు. రాజకీయంగా ఆరోపణలు చేసే ముందు ఆలోచించి, అభివృద్ధిపై మాట్లాడాలని హితబోధ చేశారు. తంబళ్లపల్లె నియోజకవర్గాన్ని దత్తత తీసుకొని కుప్పం తరహాలో అభివృద్ధి చేస్తానని, హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేస్తామని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు హామీలిచ్చి శిలాఫలకాలకే పరిమితం చేసిన ఘనత టీడీపీకే దక్కిందని ఎద్దేవ చేశారు. ఎన్నికల్లో పోటీచేసి గెలవలేని లోకేష్ మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్నారన్నారు.

శంకర్ నోరు అదుపులో పెట్టుకో..

పెద్దిరెడ్డి కుటుంబంపైన టీడీపీ మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్ విమర్శించే ముందు నోరు అదుపులో పెట్టుకోవాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులు హెచ్చరించారు. పెద్దిరెడ్డి కుటుంబాన్ని విమర్శించే అర్హత పలమనేరు మాజీ ఎమ్మెల్యే అమర్‌నాథ్‌రెడ్డి కూడా లేదన్నారు. కార్యక్రమంలో సింగల్‌విండో చైర్మన్‌లు తిరుమల అమరనాథ్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఉమాపతి, మల్లకొండ చైర్మన్ మల్‌రెడ్డి, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ ఫజరుల్లా, ఆర్బీకే చైర్మన్‌లు వెంకటేశ్వర్‌రెడ్డి, రెడ్డిమల్‌రెడ్డి, పద్మనాభరెడ్డి సర్పంచులు విష్ణు, జయచంద్ర, రాంబాబు, నాయకులు రవీంద్రారెడ్డి, సుబ్బారెడ్డి, డాక్టర్ విశ్వనాథ్, సదాశివప్ప, చాంద్‌బాషా, తదితరులు ఉన్నారు.

వైభవంగా శ్రీపుల్లావలమ్మ జాతర



శ్రీ పుల్లావలమ్మ జాతర ఉత్సవాలు

గుర్రంకొండ: మండలంలోని టి.పసలవాండ్ల పల్లె గ్రామదేవత శ్రీ పుల్లావలమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. కత్తుల విన్యాసాలతో సంప్రదాయబద్ధంగా అమ్మవారికి కావిడ్లను సమర్పించారు. రెండు రోజుల పాటు అమ్మవారి జాతర ఉత్సవాలు రంగ రంగ వైభవంగా నిర్వహించారు. గత శుక్రవారం రాత్రి కేశాపురం ఆలయంలోని శ్రీ పాలేటమ్మ అమ్మవారిని పూజారివాండ్లపల్లెకు చెందిన అమ్మవారి పూజర్లు ఊరేగింపుగా గ్రామాల్లోకి తీసుకొచ్చారు. చాందినీబండ్లు వెంట రాగా అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. బత్తినగారి పల్లెలో సంప్రదాయబద్ధంగా గొడుగులను, కావిడ్లను ఏర్పాటు చేసి పూజలు చేశారు. రాత్రి ద్రౌపది వస్త్రాపహరణం నాటకాన్ని ప్రదర్శించారు. శనివారం బత్తినగారిపల్లె నుంచి గొడుగులు, కావిడ్లను మేళతాళాలతో ఘనంగా ఊరేగిస్తూ శ్రీపల్లావళమ్మ ఆలయానికి తీసుకొచ్చారు. ఊరేగింపులో కత్తులతో విన్యాసాలు ప్రదర్శించిన తీరు అందర్ని ఆకట్టుకుంది.

10 బస్తాల బియ్యం వితరణ

మదనపల్లె : పట్టణంలోని వెలుగు ఆశ్రమపాఠశాల, కూరపర్తి చైతన్య స్రవంతి ట్రస్ట్ పాఠశాలకు మదనపల్లె టూటౌన్, తాలూకా సీఐలు మురళీకృష్ణ, సత్యనారాయణ పది బస్తాల బియ్యంను వితరణగా అందజేశారు. శనివారం సామాజిక బాధ్యతలో భాగంగా రెండు పాఠశాలలను సందర్శించిన సీఐలు అక్కడ పిల్లలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. వెలుగు, కూరపర్తి పాఠశాల యాజమాన్యాల సేవలు విలువైనవని, విద్యార్థుల చదువుకు తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. వెలుగు ఆశ్రమపాఠశాలలో విద్యార్థులకు హియరింగ్ పాడ్స్, కిట్లును అందజేశారు.

సంపద తయారీ కేంద్రాల తనిఖీ

నిమ్మనపల్లె : సంపద తయారీ కేంద్రాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తేవాలని జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి అన్నారు. శనివారం మండలపరిధిలోని తవళం సచివాలయం, సంపద తయారీ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా క్లాప్ కార్యక్రమాన్ని పటిష్టంగా పంచాయతీ స్థాయిలో అమలు చేయాలని ఆదేశించారు. ప్రతిరోజు గ్రీన్ అంబాసిడర్స్ తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. ఎంపీడీఓ లీలామాధవి, సర్పంచ్ రెడ్డెప్ప, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సేవలు భేష్



సరుకులు అందజేస్తున్న సర్పంచ్ హబీబ్‌బాషా

పీలేరు రూరల్ : గ్రామ పంచాయతీ కార్మికుల సేవలు అభినందనీయమని సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా అన్నారు. శనివారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉగాది పండుగను పురస్కరించుకుని సర్పంచ్ సొంత నిధులతో 125 మంది కార్మికులకు, ఎలక్ట్రీషియన్లకు, డ్రైవర్లకు, వాటర్‌మెన్‌లకు రెండు జతల దుస్తులు, రెండు జతల చెప్పులు, టవల్స్, నూనె, సబ్బులు అందజేశారు. కార్యక్రమంలో వార్డుమెంబర్లు ఉదయ్‌కుమార్, శ్రీనాథరెడ్డి, నాగరాజనాయక్, మల్లికార్జునరెడ్డి, అబీద్, నాగభూషణం, విక్టరీ వెంకటరమణారెడ్డి, హబీబ్‌బాషా, కాలేషా, సచిన్, షాజహాన్, ఈవో రెడ్డి ప్రసాద్‌రెడ్డి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రవి పాల్గొన్నారు.

ఘనంగా తహలీల్ ఫాతెహా



చాదర్ సమర్పిస్తున్న చింతల శివానందరెడ్డి

వాల్మీకిపురం: స్థానిక ప్రాచీన సయ్యద్ ఖాజాపీర్ మస్తాన్ వలి ఉరుసు ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి ఉరుసు, ఖవాలీ కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే శనివారం తహలీల్ ఫాతెహా కార్యక్రమం నిర్వహించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ కరీముల్లా పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సోదరుడు చింతల శివానంద రెడ్డి చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో దర్గా కమిటీ అధ్యక్షులు సందాని, వైఎస్సార్‌సీపీ నాయకులు నీళ్లభాస్కర్, కేశవ రెడ్డి, శ్రీధర్‌రాయల్, శివారెడ్డి, వేణు, జాకీర్, సాధిక్, షాహెద్, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

ల్యాండ్ కన్వర్షన్ భూముల పరిశీలన

పీలేరు : పీలేరు పట్టణం తిరుపతి మార్గంలో ల్యాండ్ కన్వర్షన్ భూములను ఆర్డీఓ రంగస్వామి శనివారం పరిశీలించారు. ఎర్రగుంటపల్లె పంచాయతీ సర్వే నెంబరు 783/4లో 64 సెంట్లు, 784/2లో 2.62 ఎకరాలు, గూడరేవుపల్లె పంచాయతీ 203/4లో 2 ఎకరాల భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చుటకు దరఖాస్తులు అందాయి. సంబంధిత భూములను శనివారం ఆర్డీవో పరిశీలించారు.

వైఎస్సార్ ఆసరాను సద్వినియోగం చేసుకోవాలి

– ఏపీఎం రజనికుమారి



ఆసరా నిధుల సద్వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ఏపీఎం రజనీకుమారి

నిమ్మనపల్లె : మూడో విడత వైఎస్సార్ ఆసరా నిధులను డ్వాక్రా సంఘ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని మండల వెలుగు ఏపీఎం రజనికుమారి అన్నారు. మండలపరిధిలోని అన్ని గ్రామాల్లో సంఘమిత్రలతో కలిసి వైఎస్సార్ ఆసరా నిధుల సద్వినియోగంపై క్షేత్రస్థాయి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులోభాగంగా వైఎస్సార్ నిధులు అందుకోనున్న సంఘ సభ్యుల జాబితాను సంబంధిత సచివాలయాల్లో అందించామన్నారు. మండలపరిధిలో 591 మంది డ్వాక్రా సభ్యులు మూడోవిడత ఆసరాలో భాగంగా రూ.5కోట్ల12 లక్షల, 86వేల, 592 అందుకోనున్నట్లు వివరించారు. ఆ యా సంఘాల పొదుపుఖాతా నుంచి సభ్యుల వ్యక్తిగత ఖాతాకు నిధులు జమచేసేందుకు సభ్యులు సంఘ సమావేశాలను ఏర్పాటుచేసుకుని తీర్మానం చేయాలని అవగాహనలో భాగంగా తెలియజేస్తున్నారు. ఈనెల 18 నుంచి 24 వరకు డ్వాక్రా సంఘ సభ్యులతో సమావేశాలు ఏర్పాటు చేసి మొదటి, రెండో విడతల్లో వచ్చిన నగదు, మూడో విడతలో అందుకోనున్న నగదు తమతో పాటు వైఎస్సార్ ఆసరా ఉద్దేశం తెలియజేస్తూ అవగాహన కల్పిస్తున్నామన్నారు.

వారపు సంతల వేలంతో ఆదాయం

కేవీపల్లె : మండలంలోని నూతనకాల్వ, వగళ్ల వారపు సంతలకు వేలం నిర్వహించడం ద్వారా పంచాయతీలకు ఆదాయం వచ్చినట్లు ఈవోపీఆర్‌డీ లతీఫ్‌ఖాన్ తెలిపారు. శనివారం నిర్వహించిన వేలంలో నూతనకాల్వ వారపు సంత గేటు వసూళ్ల హక్కును ఆనందనాయుడు రూ. 2.90 లక్షలు హెచ్చుపాట ద్వారా దక్కించుకున్నట్లు తెలిపారు. అలాగే వగళ్ల వారపుసంతను షాజహాన్ రూ. 95 వేలకు దక్కించుకున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్‌లు వెంకటమ్మ, రెడ్డికాంతమ్మ, కార్యదర్శులు పంచరత్న, గీత, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో మంచి భవిష్యత్తు

గుర్రంకొండ: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని హెడ్మాస్టర్ మదన్‌మోహన్ అన్నారు. శనివారం స్థానిక తెలుగు జెడ్పీహైస్కూల్లో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు.

మదనపల్లె సిటీ: విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయాలని ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం బాలాజీనగర్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సూచనలు తప్పక పాటించాలన్నారు.